వేసవిలో జలసిరులు


రహీంఖాన్‌పేటలోని సింగరాయ కుంట


రహీంఖాన్‌పేటలోని కాలువ ద్వారా వెళ్తున్న నీరు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట ఫీడర్ చానల్ కాలువ అనంతారం చెరువులో నీరు ఉన్నన్ని రోజులు పారుతోంది. వర్షాకాలంలో బిక్కవాగు నీరు, తర్వాత అనంతారం చెరువు ఊటనీరు ఈ కాలువ ద్వారా ప్రవహిస్తూ రహీంఖాన్‌పేటలోని సింగరాయకుంటలోకి వెళ్తుంది. పూర్వమే అనంతారం పక్కనున్న బిక్కవాగు నుంచి ఐదు కిలోమీటర్ల మేర మట్టి కాలువ ద్వారా రహీంఖాన్‌పేట పొలాలకు నీరందించినట్లు గ్రామ రైతులు తెలుపుతున్నారు. కాగా ఇప్పటికీ కాలువ ద్వారా నీరు వస్తుండగా గ్రామంలోని సింగరాయకుంటకు మళ్లిస్తున్నారు. ఉపాధి కార్మికులతో కాలువ పూడిక తీయడం, పిచ్చి మొక్కలు తొలగించడం లాంటి పనులు చేయిస్తున్నారు. ఇటీవల రహీంఖాన్‌పేటకు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పనులను పరిశీలించారు. గ్రామస్తులు ఈ ఫీడర్ చానల్ కాలువకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కాలువ ద్వారా నీరు ఎక్కువగా ప్రవహిస్తే సింగరాయకుంట నుంచి, దిగువన ఉన్న జాలకుంట, వంతడుపులకుంటకు, వెళ్తాయని గ్రామస్తులు తెలుపుతున్నారు.

కాలువ మరమ్మతు చేపట్టాలి



తిమ్మాయ చెరువు ఉన్నప్పటి నుంచి ఈ కాలువ ఉంది. మా తాతల కాలంనుంచే ఈ కాలువ ఉంది. ఈ కాలువ పారకంతో గతంలో యాసంగి, వానాకాలం రెండు పంటలు పండేవి. కాలువ మరమ్మతులు చేస్తే వరద ఎక్కువై కుంట తొందరగా నిండుతుంది.

– ఉత్కం బాలయ్య, రహీంఖాన్‌పేట

చెక్‌డ్యాం నిర్మించాలి



అనంతారం ప్రాజెక్టు దిగువన ఫీడర్ చానల్ కాలువ ప్రారంభమవుతుంది. అనంతారం బిక్క వాగు వద్ద చెక్ డ్యాం నిర్మించాలి. దీంతో కాలువ ద్వారా నీరు వేగంగా ప్రవహిస్తుంది. ఐదు కిలోమీటర్ల మేర ఉన్న మట్టి కాలువను సీసీలైనింగ్ కాలువగా మార్చాలి.

– పూదరి అంజయ్య, రహీంఖాన్‌పేట


ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం.. తెర్లుమద్దిలో మానేరు కెనాల్‌పై మట్టిపోశారు. కెనాల్‌పై కల్వర్టు నిర్మించే క్రమంలో రెండువైపులా మట్టిని తవ్వారు. ఎనిమిది నెలలుగా మట్టి కెనాల్‌పై అలాగే ఉండగా, వర్షానికి కెనాల్‌లోకి వెళ్తుందని రైతులు తెలిపారు. దీంతో నీటి సరఫరాకు ఇబ్బంది అవుతోందన్నారు. నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకుని కెనాల్ బాగుండేల చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రవికుమార్, డీఈఈ, సెల్ నెంబర్: 99635 55560

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

క్లుప్తంగా

అక్రమ అరెస్టులు సరికాదు


పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు అరెస్టును మండల బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద మాట్ల మధుకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని ప్రభుత్వం, అధికారుల తీరును ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిలివేరి చిరంజీవి, టౌన్ అధ్యక్షుడు బండి జగన్, కేటీఆర్ సేన అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్, నాయకులు గుండు ప్రేమ్‌కుమార్, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జి సందర్శన


మాట్లాడుతున్న వకుళాభరణం శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మల్లిపల్లిలో నూతన బ్రిడ్జిని రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. రూరల్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు మల్లిపల్లి వద్ద బ్రిడ్జి గుంతలమయంగా మారిందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు జా గిరి సురేశ్, మండల ఉపాధ్యక్షుడు బత్తిని ఎల్లాగౌడ్, చింతలకోటి రాజు, పరశురామ్, సాయి, ప్రేమ్‌సాగర్, వేణు, రాకేశ్, రాజు, కిరణ్, అజయ్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేట పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి మకర తోరణం సమర్పించారు. ఉదయం ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు , తదితరులు లు, పండితులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి 18 నామినేషన్లు

కోనరావుపేట: కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి 18 మంది నామినేషన్లు వేశారు. ఎన్నికల అబ్జర్వర్లు ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి మండల కేంద్రానికి వచ్చి నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషాతో పాటు ఏఎంసీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి, యూత్ నాయకుడు బొర్ర రవీందర్, బండెల సదానందం, మానుక సత్యం, ఎర్ర ఆగేష్, కచ్చకాయల బాల్‌రెడ్డి, ఉప్పుల గంగయ్యతో పాటు మొత్తం 18 మంది తమ దరఖాస్తులను అందించారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు

ఎల్లారెడ్డిపేట: ప్రొటోకాల్ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పదిరలో ఆదివారం పార్టీ నాయకుడు చెరుకు ఎల్లయ్య కొడుకు రిసెప్షన్‌కు కేకే హాజరయ్యారు. అనంతరం పదిరలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'కేకే' గెలవకపోయినా అందుబాటులో ఉంటూ సేవలు

తంగళ్లపల్లి: నెలకోసారి నియోజకవర్గానికి వచ్చే కేటీఆర్‌కు ప్రొటోకాల్ ఎందుకు? అని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు ప్రశ్నించారు. ఆదివారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో మాట్లాడుతూ.. కేకే.మహేందర్ రెడ్డి ఎన్నికల్లో గెలవకపోయినా అధికార పార్టీ నాయకుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెట్టకపోవడం సరికాదన్నారు. కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెడతామని అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయి ప్రసా ద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ (చోటు), వినోద్, శ్రీనివాస్, అనిల్, దేవదాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... మద్దిమల్ల తండాకు చెందిన శ్రీరాంనాయక్, గుగులోత్ బల్‌రాం బైక్‌పై మండలంలోని రాచర్లగొల్లపల్లికి వచ్చి వెళ్తుండగా గుండారం శివారులోని మూలమలుపు వద్ద ఎదురుగా మరో బైక్‌ను తప్పించే క్రమంలో ఇద్దరు కింద పడ్డారు. శ్రీరాం నాయక్ తలకు గాయాలుకాగా పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరిని సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న మెంగని మనోహర్

ముస్తాబాద్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ అన్నారు. మండలంలోని మోహినికుంటలో నియోజకవర్గ కేటీఆర్‌సేన కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.... ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. కేటీఆర్‌సేన బాధ్యులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ హామీల అమలుపై ప్రజలకు వివరించాలన్నారు. సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, బీఆర్ఎస్ యువజన శాఖ అధ్యక్షుడు శీలం స్వామి, కేటీఆర్‌సేన బాధ్యులు నందగిరి భాస్కర్, సాకిర్, మల్లారెడ్డి, మధు, మనీష్, నర్సింలు, నాగరాజు, రవీందర్, మహేశ్, నరేంద్రచారి, సతీశ్, సురేశ్, గణేశ్, రాజేశ్, నరేందర్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అర్హులకు మొండిచేయి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి: మండలకేంద్రంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అర్హులకు ఇళ్లు మంజరు చేయకుండా మొండిచేయి చూపారని మండల సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు వస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుద్రంగి అభివృద్ధి జరగలేదని ప్రభు త్వ విప్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాయకులు గంగం మహేశ్, మంచే రాజేశం, గణేశ్, నర్సయ్య, దయ్యాల పెద్దులు, నారాయణ, శ్యామ్, గణేశ్, సింగారపు గంగారెడ్డి, కొండయ్య, ఆకుల గంగాధర్, కాదాసు లక్ష్మణ్, ఉరడి రవి, జోగినపల్లి గంగారాం, దయ్యాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


ఎల్లారెడ్డిపేటలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లల్ల నిర్మాణాలకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ..ఇళ్లు మంజూరైన వారు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పందిర్ల లింగంగౌడ్, గంట బుచ్చాగౌడ్, రాములు, చెన్ని బాబు, నేవూరి రవీందర్‌రెడ్డి, ద్యాగం లక్ష్మినారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏఎంసీ డైరెక్టర్ ఆరెపల్లి బాలు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మాట్లాడుతూ...అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. ఇప్పటికే రెండో విడత ఇళ్ల మంజూరు పట్టాలు అందజేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి గౌడ్, వెంకట రెడ్డి, ప్రశాంత్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

కోనరావుపేట: సేంద్రియ పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సహకరించాలని ప్ర భుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ధర్మారంలోని దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకులు మూగాల ఆదర్శ్‌కుమార్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. సేంద్రియ పంటలను పండించే రైతులను ప్రోత్సహించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తనవంతు సహకారాలు అందిస్తానన్నారు. రైతులు, తదితరలున్నారు.

రైతులతో మమేకం.. సందేహాలు నివృత్తి

- ఉత్సాహంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు
- వానాకాలం సాగుపై రైతులకు అవగాహన
- గ్రామాల్లో కొనసాగుతున్న సదస్సులు


బోయినపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

బోయినపల్లి: రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు.. వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సదస్సులు జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. సదస్సులకు రైతులనుంచి మంచి స్పందన వస్తోంది. యాజమాన్య పద్ధతులతో ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వాడకం, భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 80 గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంపిక చేసిన 49 గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈనెల 5నుంచి జూన్ 13వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికా రులు తెలిపారు.

శాస్త్రవేత్తలతో 27 టీములు

గ్రామాల్లో చేపట్టే సదస్సుల్లో జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్‌తో పాటు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం జగిత్యాల, పొలాస, వ్యవసాయ పరిశోధనాస్థానం, కరీంనగర్, కూనారం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల జమ్మికుంట, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్లకు చెందిన శాస్త్రవేత్తలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిసి 27 టీములుగా ఏర్పడి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు స్థానిక వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగులో మెలకువలపై సూచనలు చేస్తున్నారు.

ఆరు సూత్రాలతో సాగు బాగు

రైతులు తక్కువ ఖర్చుతో ఆరు సూత్రాలను ఆచరించి మెలకువలు పాటిస్తే మంచి దిగుబడితో పాటు, ఆర్థికంగా లాభాలు గడించే అవకాశం ఉంటుందని సదస్సుల ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

- తక్కువ యూరియా వాడకం. సాగుఖర్చు తగ్గించడం
- అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం
- రసీదులను భద్రపరచడం.. కష్టకాలంలో నష్టపరిహారం పొందడం
- సాగునీరు ఆదా చేయడం.. భావితరాలకు అందించడం
- పంట మార్పిడి, సుస్థిర ఆదాయం పొందడం
- చెట్లను పెంచడం.. పర్యావరణ సమతుల్యత కాపాడడం

రైతులకు లాభం



తడగొండలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు సదస్సు నిర్వహించారు. సదస్సులో పెద్దమొత్తంలో రైతులు హాజరయ్యారు. భూసార పరీక్షల ఆధారంగా సేంద్రియ ఎరువులు వాడితే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. పలు సందేహాలపై శాస్త్రవేత్తలు సమాచారం అందించారు.

–గుడి శ్రీనివాసరెడ్డి, తడగొండ

స్పందన వస్తోంది



మండలంలోని విలాసాగర్, తడగొండ, బోయినపల్లి, మాన్వాడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సదస్సులు నిర్వహించాలని పై అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకు విలాసాగర్, తడగొండ, బోయినపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా, రైతులనుంచి స్పందన లభించింది.

–కే.ప్రణీత, ఎంఏవో, బోయినపల్లి

రైతులు వినియోగించుకోవాలి



ఇప్పటి వరకు 80 గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సదస్సులు నిర్వహించాం. రైతులకు మేలైన సాగు పద్ధతులు, అధిక దిగుబడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్నాం. సదస్సులకు రైతులనుంచి విశేష స్పందన లభిస్తోంది.

– కే.మదన్‌మోహన్‌రెడ్డి, కో ఆర్డినేటర్, జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి


వేములవాడ అర్బన్: శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు


సిరిసిల్ల ఎడ్యుకేషన్: మాట్లాడుతున్న దూస రఘుపతి

వేములవాడ అర్బన్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఐదు రోజుల పాటు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు సులభంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బన్నాజీ, జిల్లా రిసోర్స్ పర్సన్ స్వరాజ్య లక్ష్మీ, మధు, శిక్షణ ఆర్గనైజర్ బొజ్జ కృష్ణ, రిసోర్స్ పర్సన్లు కమలాకర్‌రెడ్డి, పట్టణ సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ఎడ్యుకేషన్: వృత్యంతర శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని ఎంఈవో దూస రఘుపతి అన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణను పర్యవేక్షించిన ఆయన వివిధ సబ్జెక్టులలో నేర్చుకున్న మెలకువలను విద్యార్థుల నైపుణ్య అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. డీఎస్‌వో పాముల దేవయ్య, వాసాల హరిప్రసాద్, అజయ్, తాడుక సురేశ్, జక్కని నవీన్, అన్నల్ దాస్ అజయ్, కె శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనరావుపేట: పాఠశాల విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మురళినాయక్ అన్నారు. కోనరావుపేట ఆదర్శ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై జరిగిన శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. వివిధ సబ్జెక్టు ఆర్పీలు జంగిటి రాజు, శ్రీధర్, తిరుపతి, గోషికొండ శ్రీనివాస్, బాలకిషన్, గాలిపెల్లి సంతోష్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాధికారి కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మనోహరాచారి, ఎంఆర్పీలు ప్రశాంత్‌కుమార్, శ్రీకాంత్, పూర్ణచందర్, ప్రవీణ్, సతీశ్, చిన్న భూమయ్య, తిరుపతి, రమేశ్, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత వివాదాస్పదం


వైకుంఠధామం పరిసరాల్లో నరికివేసిన చెట్లు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక వైకుంఠధామం పరిసరాల్లో చెట్లు నరికివేత వివాదాస్పదంగా మారింది. పొలంలోకి వెళ్లడానికి ఓ వ్యక్తి సుమారు 56 చెట్లు నరికివేయడంపై ఆదివారం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు. నీలోజిపల్లికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ పొలంలోకి వెళ్లడానికి అనువుగా ఉంటుందని కొదురుపాక వైకుంఠధామం పరిసరాల నుంచి దారికావాలని అధికారులకు విన్నవించాడు. దారి కోసం వారు ఇచ్చిన లేఖను ప్రత్యేకాధికారికి ఇచ్చాడు. తాను సెలవులో ఉన్నానని వచ్చాక విషయం పరిశీలిస్తానని ప్రత్యేకాధికారి తెలపగా.. అయినా ఆ వ్యక్తి ఆగకుండా దారి కోసం చెట్లు నరికివేశాడని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంలో కొదురుపాక గ్రామ ప్రత్యేకాధికారి శ్రీధర్‌ను వివరణ కోరగా దారి ఇవ్వాలని అధికారులు ఇచ్చిన లేఖ ఆధారంగా మోఖపై పరిశీలించగా.. చెట్లు పెద్ద మొత్తంలో ఉన్నాయని, తాను సెలవులో ఉన్నానని కొద్ది రోజులు ఆగాలని ఆ వ్యక్తితో చెప్పినట్లు తెలిపారు. చెట్లు నరికివేత విషయమై ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

• నూతన కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామ అంబేడ్కర్ మాలసంఘం అధ్యక్షుడిగా మాసం జనార్దన్ ఎన్నికయ్యారు. ఆదివారం సమావేశమైన సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కాదాసు నర్సయ్య, కార్యదర్శిగా కాయితి కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా మాసం దేవనంది, నీరటి సంజీవ్, నీరటి రమేశ్, కొంపెల్లి లింగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

• ఉచిత గుండె వైద్య శిబిరం

బోయినపల్లి: బోయినపల్లి గ్రామ పద్మశాలీ సమాజ సేవాసంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ వైద్యబృందం పద్మశాలీ సంఘం భవనంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. టూడీ ఎకో, ఈసీజీ లాంటి పరీక్షలతో పాటు, వివిధ పరీక్షలు చేశారు. మెడ్‌కవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లేశం, కార్యదర్శి మ్యాన కరుణాకర్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, శ్రీకాంత్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

• విద్యార్థికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన మహమ్మద్ సాజిద్ ఉర్దూలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉత్తీర్ణత పొందిన నూర్ భాషా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. మైనార్టీ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ షాదుల్, అజ్జు, గౌస్, ఖాజా, అబ్దుల్‌మియా, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

• విద్యుదాఘాతంతో మేక మృతి

కోనరావుపేట: బావుసాయిపేటలో విద్యుదాఘాతంతో ఓ మేక మృతిచెందింది. గ్రామానికి చెందిన తిక్కల పోశయ్య కుమారుడు జగన్ మేకలను గ్రామ శివారులో మేపుతుండగా విద్యుత్ వైర్లు తగిలి మేక మృతిచెందింది. సుమారు రూ. 15వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపారు.